
విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బాలాజీనగర్‌కాలనీలోని శివాంజనేయ సహిత రామాలయంలో ఆదివారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించగా నిర్వాహకులు ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి వెంకట్‌చౌదరి, ట్రెజరర్ భాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


రుద్రసహిత నవ చండీ మహాయాగంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి

ఘనంగా రుద్రసహిత నవ చండీయాగం

వనస్థలిపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖఃసంతోషాలతో జీవించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సిరిపురం కాలనీలో రేణుకా పీఠం జగన్మాత సేవలో మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల సహకారంతో నిర్వహించిన రుద్రసహిత నవ చండీ మహాయాగం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణవేణి కళాశాల చైర్మన్ యెన్నం ప్రియాంక మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు పద్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.


అక్షర రుద్రాక్షలతో శివుడికి తులాభార అభిషేక మహోత్సవం

శివుడికి అక్షర రుద్రాక్షలతో తులాభార అభిషేకం

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి అక్షర తులాభార లక్ష రుద్రాక్షల అభిషేకమహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తపేట భవాని చౌరస్తాలోని శ్రీ భవానీ మందిరంలో మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ భావన ఋషి, వీరమల్ల కాటంరాజు ఆధ్వర్యంలో వేద పండితుడు కోటేశ్వరరావు రూపాయి నాణేలు, లక్ష రుద్రాక్షలతో తులాభారం అభిషేక మహోత్సవాన్ని భక్తుల కోలాహలం నడుమ వైభవంగా నిర్వహించారు. లక్ష రుద్రాలతో మహా శివలింగేశ్వరుడికి నరదిష్టి నివారణ అభిషేకం, అఖండ శివ పంచాక్షరి మంత్రం, జపం, తర్పణం, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా మృత్యుంజయ పాశుపత రుద్ర, దుర్గా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.


జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్‌ను సన్మానిస్తున్న కాలనీల ప్రతినిధులు

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

చంపాపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీల్లో నెలకొన్న వివిధ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన కృషి చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. డివిజన్‌లోని విజయదుర్గకాలనీ, బాలాజీకాలనీ, డైమాండ్ కాలనీ, అలాక్‌కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆదివారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న ఆయా సమస్యలను తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీల ప్రతినిధులు శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, మాస్కోటియ, భాస్కర్‌రెడ్డి, సిరాజ్ పాల్గొన్నారు.


యాపిల్ ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటైన నూతన కార్యవర్గం, కమిటీ సభ్యులు

యాపిల్ ఎన్‌క్లేవ్ నూతన కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడలోని సర్వేనెంబర్ 287/288లోని యాపిల్ ఎన్‌క్లేవ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బుర్ర వీరస్వామిగౌడ్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా గజ్జి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా బురం ప్రకాష్, కోశాధికారిగా యు.మహేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా వై.వినోద్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా జి.వీరస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.లక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా ఓ.రామకృష్ణారెడ్డి, కరాటే చందర్‌రావు, రాజిరెడ్డి, జి.పండులను ఎన్నుకున్నారు.

అనాథ అమ్మాయి వివాహానికి 'ఉప్పల' అండ

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ ద్వారా చేయూతనందిస్తున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఉప్పల్‌లోని బీరప్పగడ్డకు చెందిన అనాథ అమ్మాయి శ్రీవాణి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా పుస్తెమెట్టెలు, చీరగాజులను నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘుపతిరెడ్డి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని పసుమాములలో మహిర మార్బుల్స్ అండ్ గ్రానైట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీరేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మహిర మార్బుల్స్ అండ్ గ్రానైట్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలు బాగున్నాయా?

- స్కాన్ చెయ్.. పనితీరు చెప్పేయ్
- ఠాణాలలో అందుబాటులో క్యూ ఆర్ కోడ్

సైదాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత విచారణలో ఇబ్బందులు, పోలీసుల పనితీరుపై మీరు సంతృప్తికరంగా ఉన్నారా? అసంతృప్తిగా ఉన్నారా? ఏదైనా సరే నేరుగా మీ అభిప్రాయాలను చెప్పేందుకు ఇప్పుడు అవకాశముంది. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో క్యూ ఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పేరుతో గల కోడ్‌ను స్కాన్ చేసి మీరు చెప్పదలుచుకున్నది తెలపవచ్చు. ఇది నేరుగా డీజీ కార్యాలయానికి చేరుతుంది. ప్రస్తుతం పిటీషన్, ఎఫ్ఐఆర్, ఈ-చలానా, పాస్‌పోర్టు పరిశీలన విభాగాల్లో అభిప్రాయాలను మాత్రమే సేకరించనున్నారు. ప్రజల అభిప్రాయాల ఆధారంగా పోలీస్‌స్టేషన్ల ర్యాంకులు ఇస్తారు.

ఏం చెప్పవచ్చంటే..

ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు ఎలా చేశారు. ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేశారా.. లేదా..? ఎఫ్ఐఆర్ చేశారా? లేదా? పోలీసులు మాట్లాడిన తీరు ఎలా ఉంది? ట్రాఫిక్ చలాన్ల గురించి.. పాస్‌పోర్టు ధ్రువీకరణ ఏ స్థితిలో ఉంది? ఇతర సేవల గురించి చెప్పొచ్చు.

ఇలా స్కాన్ చేయాలి..

- మొబైల్ ఫోన్‌తో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి.
- ఓపెన్ వెబ్‌సైట్ అని ట్యాప్ షటర్ బటన్ రాగానే దానిపై నొక్కాలి.
- సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఫాం, పోలీస్ శాఖల సేవలపై ప్రజల అభిప్రాయ సేకరణకు పేజీ తెరుచుకుంటుంది.
- తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ఒక దానిని ఎంచుకోవాలని సూచిస్తుంది.
- భాష ఎంచుకున్న తర్వాత పేరు, మొబైల్ నెంబరు, ఈ మెయిల్ ఐడీ, పోలీస్‌స్టేషన్ పేరు నమోదు చేయాలి.
- తర్వాత కాలంలో అభిప్రాయసేకరణ రాయాలి. ఇలా నింపిన ఫారాన్ని పంపించాలి.
- ఫోన్‌లో టైపు చేయడం సాధ్యం కాని వారు వాయిస్ రూపంలో కూడా అభిప్రాయాలను తెలిపవచ్చు.



సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అతికించిన క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్



పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ బోర్డు

సేవల్లో పారదర్శకత

పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. సేవల్లో పారదర్శకతకే ప్రభుత్వం క్యూ ఆర్ కోడ్ ఆధారిత అభిప్రాయ సేకరణ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజలు పోలీసుల పనితీరుపై తమ అభిప్రాయాలను నిర్భయంగా స్కాన్‌చేసి వివరించొచ్చు. ఈ కోడ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పోలీసుల పనితీరుపై సలహాలు, సూచనలు ఇవ్వాలి.

- కె.రాఘవేందర్, ఇన్‌స్పెక్టర్, సైదాబాద్

కొహెడలో అధునాతన సమీకృత మార్కెట్‌కు కృషి

- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే కొహెడలో అధునాతన సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ కే. సురేంద్రకుమార్ స్పష్టం చేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కొహెడలో నూతనంగా నిర్మించబోయే మార్కెట్ ప్రాంతాన్ని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం బాటసింగారంలో కొనసాగుతున్న తాత్కాలిక పండ్ల మార్కెట్‌ను పరిశీలించారు. పండ్ల ఎగుమతులు, దిగుమతుల గురించి అధికారులు, పాలకవర్గాన్ని అడిగి తెలుసుకున్నారు. కొహెడలో నిర్మించనున్న మార్కెట్‌కు త్వరలోనే పరిపాలన అనుమతులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మార్కెట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా నిర్మించనున్న కొహెడ మార్కెట్‌లో పండ్లు, పాల, డ్రైఫ్రూట్స్, మాంసాహార, పూల ఉత్పత్తులకు అవకాశం ఉందన్నారు. 200 ఎకరాల్లో రూ.2,900 కోట్లతో మార్కెట్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. అత్యున్నత స్థాయిలో కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే కొహెడ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ అదనపు సంచాలకులు లక్ష్మణుడు, జాయింట్ డైరెక్టర్ మల్లేషం, జిల్లా మార్కెటింగ్ రిజిస్ట్రార్ రియాజ్, ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్‌తో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.


కొహెడలో పండ్ల మార్కెట్ డీపీఆర్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన జీవనం

- కొరియా నుంచి వచ్చిన వలంటీర్లను ప్రశంసించిన మలక్‌పేట ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యకరమైన జీవనం సాగించగలుగుతామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఆదివారం ఆజంపుర డివిజన్‌లోని కాలాడేరలో గ్రీన్ ఎర్త్ ప్రాజెక్ట్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఏఎస్‌ఈజెడ్ ఆధ్వర్యంలో స్ట్రీట్ క్లీనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రతిరోజు వీధులను శుభ్రం చేయించే పనులు, ఇంటి నుంచి చెత్త సేకరించేందుకు స్వచ్ఛ ట్రాలీల ఏర్పాటు, నాలాల్లోని పూడికతీత పనులను ముమ్మరంగా చేపడుతుందన్నారు. అయినప్పటికీ ఏఎస్‌ఈజెడ్ స్వచ్ఛంద సంస్థకు చెందిన దాదాపు 200 మంది వలంటీర్లు స్ట్రీట్ క్లీనింగ్ పనులు చేపట్టి మరింత పరిశుభ్రకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. కొరియాతోపాటు పలు దేశాలకు చెందిన వలంటీర్లు సాఫ్ట్‌వేర్ లాంటి ఉన్నత హోదాల్లో ఉంటూ తమ ఖాళీ సమయాల్లో గ్రీన్ ఎర్త్ ప్రాజెక్ట్‌లో పాల్గొని తమ చేతుల్లో చీపుర్లు పట్టి కాలాడేర వీధులను శుభ్రం చేసినట్లు ఏఎస్‌ఈజెడ్ స్వచ్ఛంద సంస్థ ఇన్‌చార్జి ఎం.జెస్సీ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ జవాన్ సురేష్, ఎస్ఎఫ్ఏలు శ్రీహరి, మహేందర్, ఎంఐఎం నాయకులు షేక్ మోహియుద్దీన్ అబ్రార్, అనాస్ ఖాద్రీ పాల్గొన్నారు.



ఏఎస్‌ఈజెడ్ వలంటీర్లతో మలక్‌పేట ఎమ్మెల్యే బలాల, పక్కన ఇన్‌చార్జి జెస్సీ తదితరులు

టూవీలర్, ఆటోమొబైల్స్ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): టూవీలర్, ఆటోమొబైల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో టూవీలర్, ఆటోమొబైల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా టూవీలర్, ఆటోమొబైల్స్ అసోసియేషన్ సొంత భవనానికి కొంత స్థలాన్ని కేటాయించి, తమ సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టూవీలర్, ఆటోమొబైల్స్ వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా ఇటీవల మరణించిన అసోసియేషన్ సభ్యులు నరేష్ కుటుంబానికి అసోసియేషన్ ప్రతినిధులు సేకరించిన రూ.రెండు లక్షలను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, అసోసియేషన్ ప్రతినిధులు అరవింద్‌రెడ్డి, మోయిన్, నరేందర్‌రెడ్డి, ప్రసాద్, దామోదర్‌గౌడ్, అజయ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వ్యక్తి అదృశ్యం


కాజపాక శ్రీనివాస్

హయత్‌నగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లిన తన భర్త ఇంత వరకు తిరిగి రాలేదని భార్య హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేటలోని శాంతినగర్ నివాసి కాజపాక శ్రీనివాస్ (32) రోజువారి కూలీ. ఆరేళ్ల క్రితం మమతతో వివాహం జరగగా ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన శ్రీనివాస్ మద్యం మత్తులో భార్య మమతతో గొడవపడుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన భర్త శ్రీనివాస్ ఇంతవరకు తిరిగి రాలేదని అతని భార్య హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళ..


నోముల అలివేలు

హయత్‌నగర్ : తన అక్క కుమారుని ఇంటికి వచ్చిన మతిస్థిమితంలేని మహిళ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని వరుసకు కుమారుడైన వాకిటి వెంకటేష్‌రెడ్డి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చౌటుప్పల్ ప్రాంత నివాసి నోముల అలివేలు (43)ఈనెల 2న హయత్‌నగర్‌లోని ప్రగతినగర్‌లో నివాసముంటున్న తన అక్క కుమారుడైన వాకిటి వెంకటేష్‌రెడ్డి ఇంటికి వచ్చింది. కొంత కాలంగా ఆమెకు మతిస్థిమితం సరిగ్గా ఉండడం లేదు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లిన అలివేలు తిరిగి రాకపోవడంతో వెంకటేష్‌రెడ్డి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంత్ గాడ్గే మహారాజ్‌కు ఘన నివాళి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ స్ఫూర్తికి మూల పురుషుడు సంత్ గాడ్గేమహారాజ్ అని కాంగ్రెస్ రాష్ట్ర నేత చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సంత్ గాడ్గే మహారాజ్ జయంతిని పురస్కరించుకుని బీసీ కులాల ఐక్యవేదిక కార్యదర్శి పగడాల ఎల్లన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాడ్గే మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఖిల్లా మైసమ్మ ఆలయ డైరెక్టర్ పగడాల శ్రీశైలం, యాదవరెడ్డి, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, లింగస్వామిగౌడ్, అంజన్‌రావు, చిలక రాజు, సాయి జగదీష్, నగేష్, పగిళ్ల అంజి పాల్గొన్నారు.

మన్సూరాబాద్, : స్వచ్ఛ భారత్ పితామహుడు సంత్ గాడ్గే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య, మన ఆలోచన వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. సంత్ గాడ్గే జయంతిని పురస్కరించుకుని ఆదివారం నాగోల్ డివిజన్ పరిధిలోని మన ఆలోచన ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూస నర్సింహ బెస్త, మధు, విజయ్‌కుమార్, లింగస్వామి, రమేష్, అశోక్, శాలినిప్రియ పాల్గొన్నారు.


సంత్ గాడ్గే మహారాజ్‌కు నివాళులర్పిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

గంజాయి మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

- కత్తితో దాడి, ఇద్దరికి తీవ్రగాయాలు

సైదాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సింగరేణికాలనీ మనపురం గుడిసెలలో నివాసముంటూ కేటరింగ్ పనులు నిర్వహించే కాట్రవత్ జగన్(17) అంగోతు హర్ష(20), మధు, చంటిలు శనివారం రాత్రి చంద్రాయణగుట్టలో డిన్నర్‌కు వెళ్లి తిరిగివచ్చారు. అందరూ కలిసి జగన్ ఇంటి వద్ద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో అదే ప్రాంతంలో ఉండే మరో స్నేహితుడు ఆటోడ్రైవర్ ముదావత్ సురేష్(20) కత్తితో వచ్చి ఘర్షణకు దిగాడు. జగన్‌పై సురేష్ కత్తితో దాడి చేసేందుకు యత్నించగా అడ్డుకునేందుకు యత్నించిన హర్ష చాతికి గాయాలయ్యాయి. వెంటనే స్నేహితులు హర్షను స్థానికంగా ఆస్పత్రికి తరలించారు. అనంతరం తిరిగి జగన్ ఇంటికి మధు, చంటిలు వచ్చి కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వాళ్లను గమనించిన సురేష్ అక్కడికి వచ్చి మరోసారి జగన్‌పై కత్తితో దాడికి యత్నించాడు. ప్రతిఘటించిన జగన్ అదే కత్తితో సురేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వెంటనే స్థానికులు సురేష్‌ను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సింగరేణి గుడిసెలలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు సాగుతుండడంతోనే యువత బానిసలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గంజాయి మత్తులోనే ఈ దాడులు జరిగాయని తెలుస్తోంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ రాక్‌టౌన్, గణేష్‌పురి, సాయినగర్, డెంటల్‌కాలేజీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ రాక్‌టౌన్, గణేష్‌పురి, సాయినగర్, డెంటల్ కాలేజీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

మోదీ పాలనలో ప్రజలపై ధరల భారం : సీపీఎం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి మందగించిందని, ప్రజలపై ధరల భారం పెరగిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ ఆరోపించారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం సదరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమయిందని ఆయన విమర్శించారు. ఆదివారం బడంగ్‌పేట్‌లోని సాయినగర్‌లో నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో జగదీశ్ పాల్గొని మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో ప్రజా సమస్యలపై ఈనెల 28తేదీ నుంచి పాదయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.శేఖర్ యాదవ్, యాదయ్య, రామ్మోహన్‌గౌడ్, ఐలేశ్, చక్రవర్తి పాల్గొన్నారు.

వైఎస్ఆర్ మూర్తి కన్నుమూత

సైదాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ మూర్తి ట్రస్టు వ్యవస్థాపకుడు వైఎస్ఆర్ మూర్తి(79) ఆదివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. 20 సంవత్సరాలుగా వైఎస్ఆర్ మూర్తి ట్రస్టు ద్వారా నగర వ్యాప్తంగా పలు సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతేగాకుండా లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం, వెంకటేశ్వర భక్తసమాజం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. వైఎస్ఆర్ మూర్తి పార్థీవ దేహం సోమవారం ఉదయం లక్ష్మీనగర్‌కాలనీలోని నివాసానికి చేరుకుంటుందని అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అనాథ విద్యార్థి చదువుకు ఆర్థికసాయం అందించండి


అనాథ విద్యార్థి దూదేకుల షేక్షావలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలో గల అనాథ విద్యార్థి గృహంలోని బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ చదివే దూదేకుల షేక్షావలికి ఆర్థిక సాయం అందించాలని గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లికి చెందిన షేక్షావలి తండ్రిని కోల్పోయి పేదరికంతో ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి వసతి గృహంలో ఉంటూ ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్ తీసుకుని ఇంటర్మీడియట్‌లో 85శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాడు. అనంతరం ఫిజియోథెరపీ కోర్సులో చేరేందుకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పాల్గొనగా ఏపీ రాష్ట్రం నెల్లూరు జిల్లాలోని నారాయణ ఫిజియోథెరపీ కళాశాలలో సీటు వచ్చింది. నాలుగున్నర ఏళ్ల ఈ కోర్సుకు రూ.1.08లక్షలు, వసతి గృహానికి రూ.2.98 లక్షల చొప్పున మొత్తం రూ.4.06లక్షలు అవసరమవుతాయన్నారు. కాగా రూ.27వేలు చెల్లించి ఈనెల 25వ తేదీ వరకు సీటు రిజర్వు చేసుకోవాల్సి ఉంటుందని, దాతలు ముందుకువచ్చి షేక్షావలికి ఆర్థిక సాయం అందించి అతడి ఉన్నత విద్యకు సహకరించాలని మార్గం రమేష్ విజ్ఞప్తి చేశారు. వివరాలకు సెల్ 9985720394 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్ : తాళం వేసిన ఇంట్లో ఓ యువకుడు చోరీ చేశాడు. కిస్మత్‌పూర్‌లో మెరుగు జంగయ్య గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. శనివారం మెరుగు జంగయ్య గౌడ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఓ యువకుడు తాళాలు, తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లాడు. కత్తితో బీరువా తాళం తెరచి రూ. 3 వేలు తీసుకున్నాడు. ఇంతలో కింది పోర్షన్‌లో ఉన్న వారు దొంగ దొంగ అని అరవడంతో దొంగ పారిపోయాడు. విషయం తెలిసిన జంగయ్య గౌడ్ కోడలు హేమవతి ఇంటికి వచ్చి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దొంగ పారిపోతున్నప్పుడు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలోనూ అత్యుత్తమ బోధనలు

- ఆదర్శంగా చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ



హైదరాబాద్ సిటీ : నగరంలోని చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ అత్యుత్తమ బోధనలతో విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. తమ వద్దకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. చంచల్‌గూడ కాలేజీ 105ఏళ్ల క్రితం ఏర్పాటైంది. ఇందులో ఎంతో మంది విద్యార్థులు చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకున్నారు. అయితే వందేళ్లకు పైగా స్థాపించిన కాలేజీ శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల సహకారంతో నూతన కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కాలేజీలో 1150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ప్రభుత్వ కాలేజీల్లో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని కొన్నేళ్లుగా విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నా.. అమలుకు నోచుకోవడం లేదు. అయితే చంచల్‌గూడ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శెల్మ రాజకుమారి ప్రత్యేక చొరవ చూపించి దాతలు, అధ్యాపకుల సహకారంతో విద్యార్థులకు ప్రతిరోజు భోజనాన్ని అందిస్తున్నారు. కాగా, వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పిల్లలు ఒత్తిడికి గురికాకుండా హెల్ప్ సంస్థ ద్వారా కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీలు అందుబాటులో ఉండడంతో విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు. ప్రాక్టికల్స్‌లో విద్యార్థుల సందేహాలను అధ్యాపకులు నివృత్తి చేస్తూ వారికి మెరుగైన బోధనలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, గతేడాది అన్ని కోర్సుల్లో 90శాతం కంటే ఎక్కువ మంది ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు లెక్చరర్లు తెలిపారు. కాగా, కాలేజీలో చదివిన ఫయాజ్ అహ్మద్ జేఈఈ మెయిన్స్‌లో 95శాతం మార్కులు సాధించి ఇంజనీరింగ్ సీటు సాధించినట్లు చెప్పారు.